పేదల సంక్షేమానికి శంకరన్ విశేష కృషి



ఎస్.ఆర్.శంకరన్ చిత్రపటానికి నివాళి

బాపట్ల: పేదల సంక్షేమానికి ఎస్.ఆర్.శంకరన్ విశేష కృషి చేశారని న్యాయవాది కళ్లం హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శంకరన్ జయంతి సందర్భంగా స్థానిక రెల్లీ కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళ్లం మాట్లాడుతూ సమాజంలోని పారిశుద్ధ్య కార్మికుల జీవితాలు మెరుగుపరచడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. చాపల సుబ్రహ్మణ్యం, అల్లాడి రవికుమార్, పాట్లూరి పాలరాజు, దళాయి సుబ్బారావు, శ్రీనివాసరావు, ఎర్రం శెట్టి శ్రీనివాసరావు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మహా కనకదుర్గ నమోస్తుతే..



కనకదుర్గమ్మగా బూరుగులమ్మ



గుండెపాటమ్మ కనకదుర్గమ్మగా దర్శనం



విజయదుర్గాదేవిగా చందోలు బండ్లమ్మ వారు



సోమశేఖరాలయంలో రాజరాజేశ్వరిగా..



భట్టిప్రోలులో శ్రీ మహాగౌరీదేవిగా భ్రమరాంబ

పిట్టలవానిపాలెం: మండలంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చందోలు వేంచేసిన లింగోద్భవస్వామి ఆలయంలో పార్వతీ దేవికి దుర్గాదేవి అలంకరణ గావించారు. బగళాముఖి దేవాలయంలో అమ్మవారు విజయదుర్గాదేవిగా అలంకరణలో దర్శనమిచ్చారు. చందోలు బండ్లమ్మను బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, కత్తపాలెం సర్పంచ్ డి.వెంకటేశ్వరరెడ్డి, చందోలు బండ్లమ్మ దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, ఈఓ నరసింహమూర్తి, అల్లూరు రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, కోటిరెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మహిళలకు చీరలు పంపిణీ

రేపల్లె రూరల్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో వార్డు కౌన్సిలర్ తులసీ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ వారి 31వ వార్షికోత్సాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆదివారం వేడుకల్లో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. అనంతరం 500ల మంది మహిళలకు కౌన్సిలర్ దుర్గాప్రసాద్ అందించిన చీరలను ఎంపీ మోపిదేవి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరవపల్లి సర్పంచ్ లోయా బాబూ నాంచారయ్య, పార్టీ నాయకులు తులసీ సీతయ్య, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మహా కనకదుర్గా.. విజయ కనక దుర్గా

రేపల్లె రూరల్: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు కనకదుర్గమ్మ అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామదేవత బూరుగులమ్మ, ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబ, స్వయం భూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, వీరాంజనేయస్వామి ఆలయంలో నెలకొల్పిన అమ్మవారు, పేటేరులోని మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజలందరికీ మేలు జరగాలి

కర్లపాలెం: కనక దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ఆకాంక్షించారు. దేవీ శరన్నవరాత్రులలో భాగంగా ఆయన కర్లపాలెం మండల పరిధిలోని ఏట్రవారిపాలెం, ఎంపీ రాజుపాలెం, గాంధీ నగర్ కాలనీలలో కనక దుర్గమ్మ అమ్మవారి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వానికి దుర్గమ్మ ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

కనుల పండువగా శరన్నవరాత్రి వేడుకలు

కొల్లూరు : దోనేపూడి శివారు సోమశేఖరాలయంలోని సత్యజ్ఞాన ప్రసూనాంబ ఆదివారం భక్తులకు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ ఎం. సాంబశివరావు వేడుకలను పర్యవేక్షించారు. పెసర్లంక, ఆవులవారిపాలెం, చిలుమూరు, ఈపూరు, అనంతవరం, కొల్లూరులోని కనకదుర్గమ్మ, పార్వతీదేవి ఆలయంలో వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

సామూహిక కుంకుమార్చన

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామివారి దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా అన్న సమారాధన

భట్టిప్రోలు: చింతమోటు కొత్త కాలనీలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2,500 మందికి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. యన్నం సురేష్, జంపని రవి, సుబ్రహ్మణ్యం, దేవభక్తుని రవి కుమార్, పమిడిముక్కల సాయి, శొంటి పోతురాజు, లుక్కా గోపి, జెపీ వెంకటేశ్వరరావులు పర్యవేక్షించారు.

వైభవంగా దండి పార్వతీ తెప్పోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ దేవత శ్రీ దండి పార్వతీ అమ్మవారికి ఆదివారం పవిత్ర కృష్ణా జలాల్లో తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు దివ్య నీరాజనాలు పలికి టెంకాయలు, పండ్లు, పసుపు, కుంకుమలు అందచేసి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

భట్టిప్రోలు: పద్మశాలీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్–విజయవాడ (పీవా) ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ బండారు కుమారి శ్రీనివాసరావు స్వగృహంలో అద్దేపల్లి–భట్టిప్రోలు పీవా బ్రాంచ్ అధ్యక్షులు తిరువీధుల దేవాజీ ఆధ్వర్యంలో 36 మంది విద్యార్థులకు రూ. 44 వేలు స్కాలర్‌షిప్‌లు ఇచ్చారు. 11వ వార్డు సభ్యురాలు బండారు మాధవి, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం సాంబశివరావు, చెరుకుపల్లి, రాజవోలు బ్రాంచ్ సెక్రటరీలు అక్కల బాలాజి, బిట్రా వీరమోహన్‌రావు, పీవా ప్రధాన కార్యాలయ నిర్వాహకులు చిలుకోటి శ్రీమన్నారాయణ, పాల్గొన్నారు.

అమ్మకు నవధాన్యం సమర్పణ



మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం కనకదుర్గ శ్రీ రామ చౌడేశ్వరిస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులు నవధాన్యం బుట్టలు నెత్తిపై పెట్టుకొని ప్రదక్షిణలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు మామిడి పల్లి నాగేశ్వర శర్మ తెలిపారు.

ఎమ్మెల్యే కోన రఘుపతికి సన్మానం

బాపట్ల: కుల జనగణన భావితరాల భవిష్యత్‌కు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో కుల జనగణన చేపట్టడంతో సమాజ్‌వాది పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోన రఘుపతిని ఆదివారం సన్మానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి, భావితరాల భవిష్యత్తు గురించి ఆలోచన చేస్తారని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్, నక్కా వీరారెడ్డి పాల్గొన్నారు.